క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాల వేగం పెంచండి

బి.కొత్తకోట : ప్రభుత్వం పేదలకు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాల వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంకరయ్య కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయించేలా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించాలని, చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలని సూచించారు. సాయంత్రం మండలంలోని వడిగలవాండ్లపల్లె సచివాలయాన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

పెద్దమండ్యం: స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి సమాఖ్య సభ్యులు కృషి చేయాలని ఏపీఎం మధుబాబు అన్నారు. స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఏపీఎం మాట్లాడుతూ ఆయా గ్రామ సమాఖ్యల పరిధిలో ఉన్న ఎస్‌హెచ్‌జిల అభివృద్ధికి సమాఖ్య సభ్యులు కృషి చేయాలన్నారు. సమావేశంలో గ్రామ సంఘాల పనితీరు, స్త్రీ నిధి రుణాలపై, సంఘాల సభ్యులు తీసుకున్న రుణాల తిరిగి చెల్లింపులపై సమీక్షించారు. సభ్యులు తీసుకున్న రుణం సకాలంలో తిరిగి చెల్లించేలా చూడాలన్నారు. అలాగే ప్రభుత్వం మహిళా సంఘాలలోని సభ్యుల కోసం అమలు చేస్తున్న పథకాలపై ఏపీఎం వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు లాల్‌బీ, రేష్మా, సీసీలు శంకరమ్మ, ఆదిలక్ష్మీ, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం పెంచాలని వినతి

తంబళ్లపల్లె : పంచాయతీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు తమకు గౌరవ వేతనం పెంచాలని మంగళవారం ఎంపీడీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గత 20 ఏళ్లుగా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నా సరైన వేతనం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర పంచాయతీలలో ఇస్తున్న విధంగా రూ.12-15వేల వరకు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి, యూనిఫామ్, షోపు, నూనె ప్రతి ఏడాది ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్, మనోహర్, పద్మావతి, రెడ్డెమ్మ, వసంత, నయంతుల్లా, శేషాద్రి, మస్తాన్‌ఖాన్, ఎరుకులప్ప, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. మంగళవారం పట్టణంలోని కోటపల్లె, అజంతామిట్ట, తిరుపతి రోడ్డు, బస్టాండు తోపాటు వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా పారిశుద్ధ్యం కొరవడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరిశుభ్రత పాటించడానికి ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పంచాయతీ చెత్త సేకరణ వాహనాల్లో వేయాలని సూచించారు.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు : ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలం బండకింద తండా పరిసర ప్రాంతంలో సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక మంగళవారం తెలిపారు. బండకిందతండా సమీపంలో నాటుసారా వండుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బంది దాడులు నిర్వహించి సుమారుగా 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

4న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు సర్వీసులు

మదనపల్లె సిటీ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరువణ్ణామలైకు వచ్చే నెల 4న ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో-2 మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న ఉదయం 9 గంటలకు అల్ట్రా డీలక్స్ సర్వీసు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. దీంతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా నడుపుతామన్నారు. తిరువణ్ణామలైకు వెళ్లే భక్తులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని కోరారు.

రేపు చెరువుల వేలం

ములకలచెరువు : మండలంలోని బురకాయల కోట సచివాలయంలో గురువారం చేపలు పట్టుకోవడానికి చెరువుల వేలం నిర్వహిస్తున్నట్లు సర్పంచు వై.విజయమ్మ, కార్యదర్శి ఆజాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఆరు చెరువులకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు టోకన్ చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలని సర్పంచ్ కోరారు.

ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీని అరికట్టండి

రాయచోటి అర్బన్ : ప్రైవేటు ట్రావెల్స్ వసూలు చేస్తున్న చార్జీల దోపిడీని వెంటనే అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్రసహాయ కార్యదర్శి అంకన్న రవాణాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని అవకాశంగా తీసుకుని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యం ఇష్టారాజ్యంగా టికెట్ల ధరలను పెంచేసిందన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రైవేటు బస్సులలో కూడా ఆర్టీసీతో సమానమైన చార్జీలనే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు హంగులు

- 2వ విడత నాడు-నేడు కింద ఎంపిక
- వసతుల కల్పనకు ప్రభుత్వం శ్రీకారం
- రూ.88 లక్షలతో అభివృద్ధి పనులు



కాలేజీ ఆడిటోరియం

మదనపల్లె సిటీ : ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు మొదటి విడతలో ఆధునిక వసతులతో కొత్త రూపు రేఖలు సంతరించుకున్నాయి. రెండో విడతలో ప్రభుత్వ కాలేజీలకు సొబగులద్దాలని నిర్ణయించారు. దశాబ్దాలుగా అరకొర వసతులతో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువులు సాగుతున్నాయి. కూర్చునేందుకు సరైన బల్లలు, విద్యుత్ సౌకర్యం ,కనీసం ప్రహరీలు లేని పరిస్థితులు సాగుతున్నాయి. తాజాగా నాడు-నేడు రెండో విడత నిధులతో అభివృద్ధి పనుల్లో భాగంగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ రెండో విడత నాడు-నేడు కింద ఎంపికైంది. దీంతో కళాశాలలో సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. నాడు-నేడు కింద రూ.88 లక్షల నిధులు మంజూరయ్యాయి. కాలేజీలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో అన్ని గ్రూపుల్లో సుమారు 650 మందికి పైగా విద్యార్థినులు అభ్యసిస్తున్నారు. కాలేజీలో అన్ని తరగతి గదులలో గ్రైనేట్‌తో ఫ్లోరింగ్ వేశారు. మరుగుదొడ్లను ఆధునీకరించారు. నూతనంగా బాత్‌రూమును నూతనంగా నిర్మిస్తున్నారు. నిరంతర నీటి సరఫరా, మరుగుదొడ్లు, రక్షిత తాగునీటి సౌకర్యం, ఫర్నీచర్, గ్రీన్ చాక్‌బోర్డులు, మేజర్, మైనర్ మరమ్మత్తులు, రంగులు, విద్యుదీకరణ, రంగులు, ఫ్యాన్లు, లైట్లు పనులు చేపట్టనున్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

వసతుల కల్పనే లక్ష్యం



ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశం. ఇందులో భాగంగా కాలేజీకి నాడు-నేడు పనులు ప్రారంభించాం. మొదటి ప్రాధాన్యతగా మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయలకు ప్రధాన్యత ప్రకారం పనులు జరుగుతున్నాయి.
-బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్

కమనీయం.. శ్రీ లక్ష్మీనరసింహుడి కల్యాణం


లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. పంచామృతాలకు ప్రత్యేకంగా మూలవర్లకు అభిషేకాలు కావించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందర్నీ ఆకట్టుకొంది. ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లి వేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్‌సీపీలోనే ముస్లింలకు సముచిత స్థానం

కలికిరి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ముస్లిం మైనారిటీలకు సముచిత స్థానం లభించిందని ఎంపీపీ నూర్జహాన్ అన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిశోర్ కుమార్ రెడ్డి సోమవారం పీలేరులో జరిగిన సమావేశంలో ముస్లింలను కించపరచేలా మాట్లాడటంపై మంగళవారం ఎంపీపీ విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ, పెద్దిరెడ్డి కుటుంబం ముస్లింలకు బిస్కెట్లు వేసి వాడుకుంటున్నారనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముస్లింల సమగ్రాభివృద్ధికి పెద్దిరెడ్డి కుటుంబం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

కలికిరి ఎంపీపీ పదవి మైనారిటీలకు కేటాయించడం, మహల్‌కు చెందిన డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌కు రాష్ట్ర స్థాయిలో మైనారిటీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి కేటాయించి సముచిత స్థానం కల్పించడం ఇందుకు ప్రత్యక్ష నిదర్శమన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి

డీఎస్పీ కేశప్ప


పోలీసు సిబ్బందికి పలుసూచనలిస్తున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : పట్టణంలో రోజురోజుకీ పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసు సిబ్బంది శక్తి వంచన లేకుండా కృషి చేయాలని డీఎస్పీ కేశప్ప అన్నారు. మంగళవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం విధి నిర్వహణపై సిబ్బందికి పలుసూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఆటోలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడం, తోపుడుబండ్లు, ద్విచక్రవాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయడం, వన్‌వే ఉన్న మార్గాల్లో రెండువేపులా రాకపోకలు సాగిస్తుండటం, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో పట్టణంలో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా ఆటోడ్రైవర్లతో సమావేశం ఏర్పాటు, సీటీఎం రోడ్డు, బర్మావీధి, సంతవీధిలో వన్‌వే అమలు చేస్తున్నప్పటికీ ప్రజల సహకారం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పట్టణ ప్రజలు ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో తమవంతు బాధ్యత కనబరచాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, సరైన రికార్డులు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం చేయవద్దన్నారు. పోలీసుల తనిఖీల్లో రోడ్డుభద్రతా నియమాలు ఉల్లంఘించినట్లు తేలితే జరిమానాతో పాటుగా కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. అలాగే స్టేషన్‌లోని పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. రాత్రిపూట నిఘా మరింత పటిష్టపరచి చోరీలు, నేరాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌ఐ చంద్రమోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గాలో ప్రార్థనలు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే చింతల, డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్‌ఖాన్, ఆఘా మొహియుద్దీన్

వాల్మీకిపురం: ఈ నెల 19 నుంచి అజ్మీర్‌లోని సుప్రసిద్ధ ఇస్లాం ధార్మిక గురువు హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ ఉరుసు ఉత్సవాల నేపథ్యంలో వాల్మీకిపురంలోని హజరత్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గాలో ప్రత్యేక చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. ఉరుసు ఉత్సవాలకు స్థానిక ముస్లిం మత పెద్దలు వెళ్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆఘా మొహియుద్దీన్ పాల్గొని ప్రత్యేక చాదర్‌ను సమర్పించారు. అనంతరం ఈ నెల27న జరగనున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కుమారుడు చింతల సాయి క్రిష్ణారెడ్డి వివాహ మహోత్సవం ఆనందోత్సాహాలతో జరగాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, అబ్దుల్ కలీమ్, ట్రస్ట్ అధ్యక్షులు సందాని, మైనార్టీలు గఫర్ ఖాన్, రషీద్ సాహెబ్, రియాజ్ అహ్మద్ ఖాన్, మహబూబ్‌బాషా, సైపుల్లా, బబ్లు, ఖాద్రి, జాకీర్ హుస్సేన్, అమీన్‌పీర్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి కిషోర్‌కు లేదు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిలను విమర్శించే స్థాయి, అర్హత టీడీపీ నాయకుడు కిషోర్ కుమార్‌రెడ్డికి లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆఘా మొహియుద్దీన్, మహల్ సర్పంచ్ రియాజ్ అహ్మద్ ఖాన్, మైనార్టీ నాయకులు అబ్దుల్ కలీమ్, మండల కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా, సబ్దర్ అలీ ఖాన్ పేర్కొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి అవినీతి, అక్రమాలకు పాల్పడాల్సిన దుర్గతి పట్టలేదని, కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు అన్న అధికారాన్ని అడ్డంపెట్టుకొని, టీడీపీ ప్రభుత్వంలో హౌసింగ్ కార్పొరేషన్ పదవిని అడ్డుపెట్టుకొని కోట్లాది రూపాయలు అడ్డగోలుగా దోచుకున్న చరిత్ర కిషోర్ కుమార్ రెడ్డిదేనని విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముస్లింల ద్రోహి అని, తాను అధికారంలో ఉన్నప్పుడు ముస్లింలకు కనీస గౌరవం కూడా ఇవ్వకుండా అవమానించారన్నారు. దేశంలో రాష్ట్ర మంత్రివర్గంలో ముస్లిం ప్రాతినిధ్యం లేని ప్రభుత్వం కేవలం చంద్రబాబు నాయుడుదేనన్నారు. 2014 ఎన్నికల్లో బీజేపీతో జత కలసి ముస్లిం నాయకత్వ అణచివేతకు పాల్పడిన చంద్రబాబునాయుడు ముస్లింల ద్రోహి అన్నారు.

తహసీల్దార్‌కు మొరుసు కాపుల వినతి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మొరుసు కాపులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మొరుసు కాపులు మంగళవారం తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. మొరుసు కాపుల సఘం (వక్కలిగ) నాయకుడు మొరుంపల్లి రమేష్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని మొరుసు కాపులకు జీవో 33 ప్రకారం బీసీ-బీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. సదరు ధ్రువీకరణ పత్రం లేనందున మొరుసు కాపులు విద్యాపరంగా, ప్రభుత్వ సంక్షేమ పథకాల పరంగా ఎంతో కోల్పోయామన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ మొరుసు కాపులు సంఘం తరపున సిఫారసు పత్రంతో దరఖాస్తు చేసుకుంటే జీవో ప్రకారం ధ్రువవ పత్రం మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, మధూకర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, మంజునాథ్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, నాగరాజురెడ్డి, సురేంద్రరెడ్డి, అమరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21న ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె సిటీ : స్థానిక ఆర్టీసీ డిపో-2 ఆవరణంలో ఈనెల 21న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. లయన్స్ అభయ ఆధ్వర్యంలో జరిగే వైద్య శిబిరంలో నారాయణ హృదయాల, ఆర్.ఎస్.జాలప్పకు చెందిన ప్రముఖ వైద్యులు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. 2డీ, ఏకో టెస్టులు ఉచితంగా చేస్తారన్నారు. ఉదయం 10 నుంచి వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

25 ఆర్బీలు మంజూరు

పీఆర్ డీఈ భాస్కర్



పీలేరురూరల్ : నియోజకవర్గంలోని జగనన్న కాలనీల ముందు రూ.104.45 కోట్లతో 25 ఆర్బీలు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ డీఈ పి. భాస్కర్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో 30 అడుగుల ఆర్బీలు 2 మంజూరయ్యాయని ఒక్కోదానికి రూ. 4.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అలాగే 20 అడుగుల ఆర్బీలు 23 మంజూరయ్యాయని, ఒక్కో దానికి రూ. 4.15 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పీలేరుకు 14, కలికిరికి 6, వాల్మీకిపురంకు 5 ఆర్బీలు మంజూరైనట్లు చెప్పారు. పీలేరు మండలంలో గూడరేవుపల్లె, ముడుపులవేములకు 30 అడుగుల ఆర్బీలు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే స్థలాలు పరిశీలించి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతామని చెప్పారు.

23న ఆత్మార్పణ దినోత్సవం

మదనపల్లె సిటీ : స్థానిక వాసవీభవన్‌వీధిలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈనెల 23న ఆత్మార్పణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఓంప్రకాష్ తెలిపారు. ఉదయం ఆలయంలో వాసవీ సుప్రభాత సేవ, శ్రీ ప్రసన్న వెంటరమణస్వామి ఆలయం నుంచి గంగ తెచ్చుట, గంగగతో వాసవీదేవతకు కలశపూజ జరుగుతుందన్నారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష అలంకారం చేస్తామన్నారు. ఆర్యవైశ్యులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత గుండ్రేవారిపల్లె


విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న జెడ్పీటీసీ గజ్జెల శృతి

కేవీపల్లె : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12 నుంచి నిర్వహించిన శ్రీ గర్నిమిట్ట యల్లమ్మతల్లి మండల స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో గుండ్రేవారిపల్లె జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం గుండ్రేవారిపల్లె, కుమ్మరపల్లె జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా గుండ్రేవారిపల్లె జట్టు విన్నర్స్‌గా నిలవగా, కుమ్మరపల్లె జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు జెడ్పీటీసీ గజ్జెల శృతి రూ. 21,116 నగదు బహుమతి తోపాటు ట్రోఫీ అందజేశారు. రన్నర్స్ జట్టుకు ఆర్గనైజర్స్ తరపున రూ. 10,116 నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ గజ్జెల శీనారెడ్డి, యల్లమ్మ ఆలయం చైర్‌పర్సన్ రామసుబ్బమ్మ, నాయకులు దినేష్‌రెడ్డి, వెంకటరమనారెడ్డి, యల్లయ్య, గౌస్, బావాజీ, సుధీర్‌రెడ్డి, ఆర్గనైజర్స్ మహేష్‌రెడ్డి, ఆనంద్, బాలాజీ, గోవర్ధన్‌రెడ్డి, రమేష్, తరుణ్‌రెడ్డి, శశి, నంద తదితరులు పాల్గొన్నారు.

5జీ టెక్నాలజీపై సర్వత్రా ఆసక్తి

పూనే ప్రొఫెసర్ స్వప్నిల్ గౌల్


మాట్లాడుతున్న స్వప్నిల్ గౌల్

కురబలకోట : ప్రపంచంలో సర్వత్రా 5జీ టెక్నాలజీ పట్ల ఆసక్తి నెలకొందని, ఇది నూతన ఒరవడిని సృష్టించగలదని పూనే నుమెరిజిఎస్ ఫౌండర్ స్వప్నిల్ గౌల్ అభిప్రాయపడ్డారు. మంగళవారం అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కింద మైక్రోవేవ్ పాసివ్ సర్క్యూట్లు, డిజైన్ ఫ్యాబ్రికేషన్, మేజర్‌మెంట్స్‌పై ఆయన మాట్లాడుతూ 5జీ వైర్‌లెస్ టెక్నాలజీ అద్భుతంగా ఉండగలదన్నారు. మొబైల్ వినియోగదారులు వారి పరికరాలను, డేటాను అత్యంత వేగంగా డౌన్‌లోడు చేయగలదన్నారు. సమాచారం పంపడం, స్వీకరించడం జాప్యం లేకుండా సాగుతుందన్నారు. ప్రపంచంలో పలు దేశాలు 5జీ టెక్నాలజీ పట్ల ఎంతో ఆసక్తి కనపరుస్తున్నాయన్నారు. ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు.

రైతు ఉత్పత్తి కేంద్రం పరిశీలన


మాట్లాడుతున్న డీహెచ్‌ఓ రవిచంద్ర బాబు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కుమ్మరవారిపల్లి సమీపంలో చేపడుతున్న రైతు ఉత్పత్తి సెంటర్ షెడ్డును అన్నమయ్య జిల్లా హార్టికల్చర్ అధికారి (డీహెచ్‌వో) రవిచంద్ర బాబు మంగళవారం పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారు పరస్పర సహాయక సహకార సంఘం ద్వారా రైతుల సౌకర్యార్థం రూ.15 లక్షల నిధులతో చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నాణ్యతగా పనులు జరగడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసారు. రైతులు పండించే వివిధ రకాల కూరగాయలు, ఇతర పంటలను సహకార సంఘం ద్వారా కొనుగోలు చేసి వాటిని ఇక్కడే గ్రేడింగ్ చేసి మార్కెటింగ్‌కు తరలిస్తామన్నారు. హార్టికల్చర్ క్లస్టర్ అధికారి ప్రతాప్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ గంగాద్రి, ఎఫ్‌పీవో సీఈఓ రమ్య, రైతు సంఘం సభ్యులు సుదర్శన్, విశ్వనాథ్‌రెడ్డి, మారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నసంతర్పణను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

తంబళ్లపల్లె : మహాశివరాత్రి పర్వదినాన మల్లయ్య కొండకు వచ్చే భక్తులకు శ్రీమల్లికార్జునస్వామి సోసియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టే అన్నసంతర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కమిటీ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి కోరారు. మంగళవారం ఆదర్శ పాఠశాల ఆవరణంలో కమిటీ సమావేశం జరిగింది. అన్నసంతర్పణ ఏర్పాట్లు, నిర్వహణ, నిధుల సమీకరణ, జమాఖర్చులు తదితర అంశాలపై చర్చించారు. కమిటీ సభ్యుల అభిప్రాయం మేరకు నూతన కమిటీని ఎన్నుకునేందుకు తీర్మానించి ఆమోదించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బివి రమణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణారెడ్డి, కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా రమణారెడ్డి, కమిటీ సభ్యులు సహదేవ, రామూర్తి, శంకర్‌రెడ్డి, శివారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

108 మదనపల్లె డివిజన్ ఇన్‌చార్జ్‌గా చలపతి


అంబులెన్స్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఓఈ చలపతి

మదనపల్లె : మదనపల్లె డివిజన్ 108 అంబులెన్స్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జ్‌గా ఎస్.వి.చలపతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక జిల్లా ఆస్పత్రిలోని 108 అంబులెన్స్‌లను తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని లైఫ్ సపోర్ట్ పరికరాలను పరిశీలించారు. రోగులకు మెరుగైన సేవలందించేందుకు సిబ్బందికి పలుసూచనలు చేశారు. గతంలో మదనపల్లె డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న నాగభూషణంను తాత్కాలికంగా విధుల నుంచి తప్పించడంతో కడపలో 108 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న తనను మదనపల్లె డివిజన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు.

ఘనంగా కనుమ వేడుకలు


చిట్లా కుప్ప వద్ద గ్రామస్తులు

పీలేరురూరల్ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో కనుమ వేడుకలు నిర్వహించారు. మండలంలోని ముడుపులవేముల, యర్రగుంట్లపల్లె, రాజీవ్‌నగర్ కాలనీ, మోడల్ కాలనీ, కాకులారంపల్లె, దొడ్డిపల్లె తదితర గ్రామాల్లో సంబరాలు చేసుకున్నారు. ఉదయం చల్లపెట్టి ఊరేగింపుగా వెళ్లి సమీప చెరువులు, బావుల్లో వేశారు. సాయంత్రం పశువులకు బెలూన్, పుష్పాలతో అలంకరించారు. గ్రామాల సమీపంలో కటమరాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్లాకుప్పకు నిప్పు పెట్టి వీక్షించారు.

గాడిద పాలకు 'భలే' గిరాకీ


గాడిదతో వీధుల్లో తిరుగుతున్న మహిళ

పీలేరు : 'గంగి గోవు పాలు గరిటెడైనను చాలు కడవడైన నేమి ఖరము పాలు' అంటూ వేమన శతకంలో ఉన్న పద్యం గురించి అందరికీ తెలిసిందే. అయితే అందుకు భిన్నంగా కొంతకాలంగా గాడిద (ఖరము) పాలకు మంచి గిరాకీ లభిస్తోంది. కొందరు గాడిదలను వీధుల చుట్టూ తిప్పుతూ గాడిద పాలు సేవిస్తే వివిధ రుగ్మతలు తొలగిపోతాయని, అనేక పోషక విలువలు ఉన్నాయంటూ మైక్ ద్వారా ప్రచారం గుప్పిస్తున్నారు. ప్రధానంగా చిన్నపిల్లలకు గాడిద పాలు తాపించడం వలన ఆస్తమా, దగ్గు, నీరసం లాంటి వ్యాధులు నయం కావడం తోపాటు మంచి ఎదుగు దల ఉంటుందని, ఎముకలు బలంగా తయారవుతాయని చెబుతున్నారు. ఇందుకు ఆకర్షితులైన పలువురు గాడిద పాలకోసం ఎగబడుతున్నారు. సుమారు 20 మిల్లీ లీటర్ల పాలాడి పాలు రూ. 100తో విక్రయిస్తున్నారు. అయితే గాడిద పాలల్లో ఎలాంటి పోషక విలువలు లేవని, కేవలం ఆదాయం కోసం ఇలా మభ్యపెట్టి విక్రయిస్తున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచిత శిక్షణకు ఆహ్వానం

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో మదనపల్లెలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన నిరుద్యోగులకు డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు సంబంధించి మూడునెలలు ఉచితంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 18న జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేవారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ లో నమోదు చేసుకోవచ్చన్నారు. కోర్సులో 90 శాతం అటెండెన్స్ కలిగిన వారికి రూ.1,000 స్టైఫండ్ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9553202509 ఫోన్ నెంబర్‌పై సంప్రదించాలన్నారు.

అన్నమాచార్య సంకీర్తనాలాపన


అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న మహిళా భక్తులు

రాజంపేట : పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలోని అన్నమయ్య ధ్యాన మందిరంలో మహిళలు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. ముందుగా అన్నమయ్య విగ్రహానికి పూజలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన అన్నమాచార్య సంకీర్తన సేవాసమితి ఆధ్వర్యంలో సంకీర్తనలు చేపట్టారు. అన్నమయ్యను స్మరించుకుంటూ ప్రతి యేటా అన్నమయ్య సంకీర్తన సేవాసమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. సాయిలోకేష్, కంబాల శ్రీనివాసులు, సురేష్‌రాజు, షబ్బీర్ అహమ్మద్, గ్రామ పెద్దలు అదృష్టదీపుడు, కొత్తపల్లి రమణయ్య పాల్గొన్నారు.